ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
ఆదివారం 5 జనవరి 2025
జిల్లాల వార్తలు

## క్విజ్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

అల్లాదుర్గం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీలో 11 కళాశాలల విద్యార్థులు పోటీపడగా.. అల్లాదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ తుక్కారం తెలిపారు. శనివారం కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో విజేతలను శాలువాతో సత్కరించారు.



# అవనిపై హరివిల్లు..

### సందడిగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు



ముగ్గును పరిశీలిస్తున్న అతిథులు

మెదక్ అర్బన్/కల్చరల్/ మున్సిపాలిటీ జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అందమైన రంగవల్లులతో అవనిపై హరివిల్లు ఆవిష్కృతమైంది. సంక్రాంతి విశిష్టతను తెలియజేసేలా, పల్లె జీవనాన్ని ప్రతిబింబించేలా నారీమణులు వేసిన ముగ్గులు కట్టిపడేశాయి. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్ట్‌నర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ప్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) శనివారం పట్టణంలోని వెంకట్రావునగర్‌లోని సిద్దార్థ్ మోడల్ స్కూల్ వేదికగా సందడిగా జరిగాయి. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన పోటీలకు మెదక్ పట్టణంతోపాటు జిల్లాలోని పలు మండలాల నుంచి మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పోటీల్లో 115 మంది పాల్గొని మనోహరమైన ముగ్గులు వేశారు. పోటీల న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు లక్ష్మీప్రసన్న, రజిని, అన్నపూర్ణ వ్యవహరించారు.

### విజేతలు వీరే..

ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి మాలతి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి శ్వేత రూ.4 వేలు, తృతీయ విజేత సౌమ్య రూ.3 వేలు గెలుచుకున్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సిద్దార్థ్ మోడల్‌స్కూల్ యాజమాన్యం ప్రోత్సాహక బహుమతులు అందజేసింది.

### 'ఆంధ్రజ్యోతి' చొరవ అభినందనీయం: అదనపు కలెక్టర్ మెంచు నగేష్

పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మెంచు నగేష్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు 'ఆంధ్రజ్యోతి' తీసుకున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. యువతులు, మహిళలు వేసిన అందమైన ముగ్గులను చూస్తుంటే మెదక్‌లో సంక్రాంతి ముందే వచ్చినట్లుగా అనిపిస్తుందని అన్నారు. ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు రెండోసారి హాజరుకావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ అద్భుతంగా ముగ్గులు వేశారని కొనియాడారు. జిల్లాలోని అన్ని వర్గాలవారు సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

### ఆహ్లాదాన్నిచ్చిన రంగవల్లులు: అదనపు ఎస్పీ (అడ్మిన్) మహేందర్

ముగ్గుల పోటీలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పోటాపోటీగా రంగవల్లులు తీర్చిదిద్దారని అదనపు ఎస్పీ (అడ్మిన్) మహేందర్ పేర్కొన్నారు. నిత్యం ఒత్తిడితో కూడిన విధులను నిర్వహించే తమకు ముగ్గుల పోటీకి హాజరుకావడం ఎంతో అహ్లాదాన్నిచ్చిందని చెప్పారు. మహిళల రక్షణ, సైబర్‌క్రైం గురించి అవగాహన కల్పించేలా ముగ్గులు వేసిన మహిళలకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

### సంప్రదాయ పరిరక్షణకు పెద్దపీట: మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు 'ఆంధ్రజ్యోతి' పెద్దపీట వేస్తుందని మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ పేర్కొన్నారు. సమాజహిత కార్యక్రమాల నిర్వహణలో ఆంధ్రజ్యోతి ముందుంటుందని కొనియాడారు. అవినీతిని వెలికితీయడంలోనూ, పేదల పక్షాన పోరాడడంలోనూ దమ్మున్న పత్రికగా పేరు నిలుపుకుంటున్నదని ప్రశంసించారు. తెలుగువారికే ప్రత్యేకమైన సంక్రాంతి సంబురాలను 'ఆంధ్రజ్యోతి' ముందుగానే నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

### మహిళలకే ప్రత్యేకం : డీఈవో రాధాకిషన్

చుక్కలతో ముగ్గులు వేసే కళ మహిళకే ప్రత్యేకమని, కళలు, సాంస్కృతిక కార్యక్రమాల వైపు మహిళలను ప్రోత్సహించడానికి ముగ్గుల పోటీలు ఉపయోగపడతాయని డీఈవో రాధాకిషన్ పేర్కొన్నారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా పోటీలో పాల్గొనడమే గొప్ప విషయమన్నారు.

### సందడిగా బహుమతుల ప్రదానం

విజేతలుగా నిలిచినవారికి ముఖ్య అతిథులు మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, డీఈవో రాధాకిషన్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, 'ఆంధ్రజ్యోతి' ఎడిషన్ ఇన్‌చార్జి సలీం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' విలేకరులు హరినాథ్, వీర్‌కుమార్, ఇక్బాల్, రాము, శ్రీనివాస్, ఏబీఎన్ శ్యామ్, ఏడీవీటీ శేఖర్‌గౌడ్, ప్రముఖ వ్యాఖ్యాత వైద్యశ్రీనివాస్‌శర్మ, స్కూల్ ఇన్‌చార్జిలు కల్యాణి, అన్నపూర్ణ, సంగీత, కవిత, సంధ్య, అపర్ణ, ప్రీతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



**సంకల్పంతో సాధించా : మాలతి, చిన్నశంరంపేట, (మొదటి బహుమతి)**

సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని 'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీ నిరూపించింది. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన ప్రకటన చూసి ముగ్గుల పోటీలో పాల్గొనేందుకు వచ్చాను. మన సంస్కృతిని ప్రోత్సహించేందుకు సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం. ప్రథమ బహుమతి రావడం సంతోషంగా ఉంది.



**ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు: శ్వేత, పీఈటీ, తూప్రాన్ (ద్వితీయ బహుమతి)**

తూప్రాన్ మండలం ఘనపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న నేను గతంలోనూ 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ముగ్గుల పోటీలో పాల్గొన్నాను. రెండో బహుమతి రావడం సంతోషంగా ఉంది. వచ్చేసారి మళ్లీ పోటీల్లో పాల్గొని మొదటి బహుమతి గెలుచుకుంటాను. ముగ్గుల పోటీల ద్వారా మహిళలు, యువతులను ప్రోత్సహిస్తున్న 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు.



**గర్వంగా ఉంది : సౌమ్య, మెదక్ (తృతీయ బహుమతి)**

'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ముగ్గుల పోటీలో తృతీయ బహుమతి సాధించినందుకు గర్వంగా ఉంది. రెండేళ్ల క్రితం జరిగిన పోటీల్లోనూ పాల్గొని మొదటి బహుమతి సాధించాను. ముగ్గుల పోటీల రూపంలో మహిళలకు ప్రతిభ చాటుకునే అవకాశం కల్పించిన 'ఆంధ్రజ్యోతి'కి ధన్యవాదాలు.

## నేడు సంగారెడ్డిలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు

సంగారెడ్డి రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ప్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) నేడు సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో నిర్వహించనున్నారు. పోటీలకు స్పాన్సర్‌గా వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తోపాజీ అనంతకిషన్ వ్యవహరిస్తున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల యువతులు, మహిళలు ఉదయం 9 గంటల వరకు స్కూల్‌కి చేరుకోవాల్సి ఉంటుంది. ఈ పోటీల్లో గెలుపొందినవారికి ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు ఇవ్వనున్నారు. పోటీలో పాల్గొనే ప్రతీ ఒక్కరికి బహుమతి ఇస్తారు. పోటీలకు ముఖ్య అతిథులుగా సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి హాజరుకానున్నారు.




## ఎముకలు కొరికే చలి..

- వణుకుతున్న ఉమ్మడి జిల్లా
- రాష్ట్రంలోనే అత్యల్పంగా కోహీర్‌లో 6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు


7

## ప్రజా సమస్యలను కవితల్లో లేవనెత్తాలి

- కవి, గాయకుడు గోరటి వెంకన్న




మాట్లాడుతున్న కవి, గాయకుడు గోరటి వెంకన్న

సంగారెడ్డి రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కవితలు, పాటలతో కవులు, కళాకారులు ప్రజా సమస్యలను లేవనెత్తాలని ప్రముఖ కవి, గాయకుడు, శాసనమండలి సభ్యుడు గోరటి వెంకన్న పేర్కొన్నారు. సీపీఎం మహాసభల సందర్భంగా సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శనివారం నిర్వహించిన 'జన కవనం' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల జీవితాలను ప్రతిబింబించేలా ఉంటేనే కవిత్వానికి ఆదరణ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకుబ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్. వీరయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల్లో చైతన్యం అత్యవసరం

జహీరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మాదిగల్లో చైతన్యం అత్యవసరమని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహంమాదిగ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్ 'లక్ష డప్పులు-వేయి గొంతుకలు' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జహీరాబాద్ నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లేందుకు జాగృతం చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. అనంతరం జహీరాబాద్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏర్పుల టింకుమాదిగ, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్‌కుమార్, నర్సింహులు, ప్రధాన కార్యదర్శులుగా సుకుమార్‌పూలేను ఎన్నుకున్నారు.

## 'విద్యార్థులకు క్రమశిక్షణ అత్యవసరం'

జహీరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు క్రమశిక్షణ అత్యవసరమని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరీక్రిష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదువుకోవాలని సూచించారు.

## జాతీయస్థాయి రంగోత్సవ పోటీలకు 36 మంది

తూప్రాన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల, కళాశాల (వెల్దుర్తి) విద్యార్థులు జాతీయస్థాయి రంగోత్సవ పోటీలకు ఎంపికయ్యారు. గతనెలలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 177 మంది విద్యార్థులు గీసిన చిత్రాలను జాతీయస్థాయి రంగోత్సవ నిర్వహణకు పంపగా.. 36 మంది ఎంపికయ్యారు. గురుకులంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభచూపిన విద్యార్థులకు ఎంఈవో సత్యనారాయణ షీల్డ్‌లను అందజేశారు.

## విద్యారంగ పరిరక్షణకు పోరాటాలే శరణ్యం

రామాయంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యారంగ పరిరక్షణకు మరిన్ని పోరాటాలు తప్పవని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ పిలుపునిచ్చారు. రామాయంపేటలో శనివారం జరిగిన 29వ జిల్లా మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత విద్యపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందన్నారు. ఇప్పటికే రూ.8,220 కోట్ల విద్యార్థుల స్కాలర్‌షిప్స్ పేరుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.




సిద్దిపేట : ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు




సిద్దిపేట : మొదటి బహుమతి గెలుచుకున్న యామినికి మెమోంటో, నగదు అందజేస్తున్న అతిథులు




సిద్దిపేట : రెండో బహుమతి గెలుచుకున్న రమాదేవికి మెమోంటో, నగదు అందజేస్తున్న అతిథులు



సిద్దిపేట : రెండో బహుమతి గెలుచుకున్న శ్రీలతకు మెమోంటో, నగదు అందజేస్తున్న అతిథులు



సిద్దిపేట: భోగిమంట వేస్తూ..



సిద్దిపేట పట్టణం మైత్రివనం కాలనీలోని క్రాంతి హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



# పండగలా..

**అమ్మవారి రూపాలు, మన ఊరి బసవన్నలు, సంక్రాంతి గంగిరెద్దులు, ధాన్యపు రాశులు, నవ ధాన్యాలు, గొబ్బెమ్మలతో సంక్రాంతి ముందుగానే వచ్చిందా అనేలా ముత్యాల ముగ్గులు ఆకట్టుకున్నాయి. పండుగ సంబరమే కాకుండా సామాజిక అంశాలను మేళవించి వేసిన రంగవల్లులు కనువిందు చేశాయి. మహిళా శక్తి ప్రతిబింబించేలా, సామాజిక చైతన్యం ఉట్టి పడేలా వివిధ రంగులతో ముగ్గులను అందంగా తీర్చిదిద్దారు.**

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) శనివారం మెదక్, సిద్దిపేట జిల్లా కేంద్రాల్లో పండగ వాతావరణంలో జరిగాయి. సిద్దిపేట పట్టణం మైత్రివనం కాలనీలోని క్రాంతి హైస్కూల్ ఆవరణలో, మెదక్ పట్టణం వెంకట్‌రావునగర్‌లోని సిద్దార్థ్ మోడల్ స్కూల్ ఆవరణలో పోటీలను నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు హాజరై ముగ్గులు వేశారు. న్యాయ నిర్ణేతలు అన్ని రంగవల్లులను పరిశీలించి విజేతలను ప్రకటించగా, అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.



మెదక్ పట్టణం వెంకట్రావునగర్‌లోని సిద్దార్థ మోడల్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



మెదక్ :మొదటి బహుమతి గెలుచుకున్న మాలతికి నగదు అందజేస్తున్న అతిథులు



మెదక్ : ద్వితీయ బహుమతి గెలుచుకున్న శ్వేతకు నగదు అందజేస్తున్న అతిథులు



మెదక్ : తృతీయ బహుమతి గెలుచుకున్న సౌమ్యకు నగదు అందజేస్తున్న అతిథులు



మెదక్ : పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ మహేందర్, అదనపు కలెక్టర్ నగేశ్




మెదక్ : ముగ్గు వేస్తున్న విద్యార్థినులు



కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యులు

## ధనుర్మాస ఉత్సవాలకు 'వైకుంఠపురం' ముస్తాబు

● రేపు శ్రీవారి రథయాత్ర, 10న వైకుంఠ ఏకాదశి

సంగారెడ్డి అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస ఉత్సవాలకు వైకుంఠపురం దేవాలయం ముస్తాబైందని ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యులు తెలిపారు. సంగారెడ్డి శివారులోని ఆ దేవాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. ఈ నెల 6న యువ వికాస్ ఆధ్వర్యంలో శ్రీవారి రథయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 11న వైకుంఠ ద్వాదశి, 12 న కూడార్తై(1008 క్షీరాన్న ప్రసాద నివేదన), 13న గోదారంగ నాథుల కల్యాణం, 14 ఏకాంత సేవ(ఊంజల్), 15 న సర్వమంగళా దేవీ ఆవిర్భావ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దేవేందర్, వీరేందర్, అశ్వంత్, సంతోష్, ద్వారకా రవి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్



ముస్తాబైన బాగారెడ్డి స్టేడియం

జహీరాబాద్, జనవరి4 (ఆంధ్రజ్యోతి) : అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌కు జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్ ముస్తాబైంది. ఈ నెల 5 నుంచి 14 వరకు జరగనున్న ఈ టర్నీమెంట్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు ఖిజార్ యాఫై, కమిటీసభ్యులు తెలిపారు. గెలుపొందిన జట్టుకు రూ.6.11 లక్షలు, రన్నరప్ జట్టుకు రూ.3.55 లక్షలు బహుమతిగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 16 జట్లు పాల్గొంటాయని, రోజువారీగా ఆయా జట్లకు ప్రోత్సాహక బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.

# ఎముకలు కొరికే చలి..

● వణుకుతున్న ఉమ్మడి జిల్లా
● రాష్ట్రంలోనే కోహీర్‌లో అత్యల్పంగా 6.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



కోహీర్‌లో చలి మంట వేసుకున్న యువకులు

కోహీర్, జనవరి 4: (ఆంధ్రజ్యోతి) గత నాలుగు రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లా చలికి గజగజ వణికిపోతున్నది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోతుండడం.. దీనికి తోడు శీతల గాలులు వీయడంతో ఎముకలు కొరికేలా చలి తీవ్రత పెరుగుతున్నది. శనివారం ఉదయం రాష్ట్రంలోనే కోహీర్‌లో 6.0 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే న్యాల్‌కల్ మండలంలో 6.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా, మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని బోడగట్‌లో 8.4 ఉష్ణోగ్రత నమోదైంది. ఇక సిద్దిపేట జిల్లాలోని మర్కూక్ మండలం అంగడికిష్టాపూర్‌లో 9.2 ఉష్ణోగ్రత నమోదైంది. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలంతో పాటు న్యాల్‌కల్ మండలంపై చలి ప్రభావం అత్యధికంగా కనపడుతున్నది. రాష్ట్రంలో ఈశాన్య గాలులు చురుకుగా వీస్తుండడంతో చలి తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణం శాఖ సూచిస్తుంది. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్, న్యాల్కల్ మండలాల్లో ప్రతి సంవత్సరం అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత ఐదేళ్లుగా కోహీర్ మండలంలో కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయికి పడిపోతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు కాగా కోహీర్‌లో నాలుగు రోజులుగా ఉష్ణోగ్రత సింగిల్ డిజిట్‌కు పడిపోయింది. శనివారం కోహీర్‌లో 6.0 ఉష్ణోగ్రత నమోదు కాగా, ఈ సీజన్‌లో ఇదే తక్కువ.

### ఉమ్మడి జిల్లాలోని ఉష్ణోగ్రత వివరాలు..

సంగారెడ్డి జిల్లాలో కోహీర్ 6.0, న్యాల్‌కల్ 6.3, అల్మాయిపేట్‌లో 7.3, మల్‌చేల్మ7.5, నల్లవల్లి 7.7 అల్గోల్ 7.9, సత్వార్ 8.1, ఆర్.సిపురం 8.2, లక్ష్మీసాగర్ 8.2, మొగుడంపల్లి 8.3, నిజాంపేట్ 8.3, ఝరాసంగం 8.7, మునీపల్లి 9.0, జహీరాబాద్‌లో 9.1, అన్నసాగర్ 9.3, ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లాలోని బోడగట్ 8.4, మనోహర్‌బాద్ 9.1, శివ్వంపేట్ 9.4, నార్సింగి 9.7, కొల్చారం 9.8 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక సిద్దిపేట జిల్లాలోని మర్కూక్ మండలంలోని అంగడికిష్టాపూర్‌లో 9.2, అక్బర్‌పేట్‌భూంపల్లి మండలంలోని పోతరెడ్డిపేట్‌లో10.0 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## ఏటీఎం కార్డు మార్చి డబ్బులు కాజేశాడు

తూప్రాన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కార్డును మార్చేసి డబ్బులు కాజేసిన సంఘటన తూప్రాన్ పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం తూప్రాన్ మండలం దాతర్‌పల్లి గ్రామానికి చెందిన చింతల శ్రీనివాస్ శనివారం మధ్యాహ్నం తూప్రాన్ ఎస్‌బీఐ పక్కనే ఉన్న ఏటీఎం కేంద్రంలో డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లాడు. డ్రాకు ప్రయత్నించగా డబ్బులు రాకపోవడంతో పక్కనే ఉన్న గుర్తు తెలియని వ్యక్తికి కార్డు ఇచ్చి చూడమని చెప్పాడు. డబ్బులు తీస్తున్నట్లు ప్రయత్నించి రావడంలేదంటూ ఏటీఎం కార్డు మార్చి ఇచ్చి వెళ్లిపోయాడు. శ్రీనివాస్ మరో ఏటీఎంకి వెళ్లి డ్రా చేసేందుకు ప్రయత్నించగా, కార్డు అతడిది కాదని గుర్తించాడు. దీంతో ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లి ఖాతాను పరిశీలించగా రూ. 42వేలు డ్రా చేసినట్లు గుర్తించాడు. ఈ విషయంలో బాధితుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



## కేతకీలో ఎస్పీ రూపేష్ పూజలు

ఝరాసంగం, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో శనివారం జిల్లా ఎస్పీ రూపేష్ కుటుంబ సమేతంగా పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అధికారులు ఎస్పీకి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

## ఉత్సాహంగా సైక్లింగ్ ర్యాలీ

● ప్రారంభించిన మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్



సైక్లింగ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్

మెదక్ అర్బన్, జనవరి 4: రోజూ అరగంట సైక్లింగ్ చేయడం ఆరోగ్యదాయకమని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. శనివారం సిద్దార్థ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన సైక్లింగ్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. పట్టణంలోని వెంకట్రావ్‌నగర్ కాలనీలో మొదలైన ర్యాలీను డీఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైక్లింగ్ చేస్తే మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవుతామన్నారు. రోడ్డుపై వెళ్తున్నప్పుడు ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చన్నారు. హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ సభ్యులు కోటేశ్వరరావు మాట్లాడుతూ.. నాకు 73 ఏళ్ల వయసు ఉన్నప్పటికీ నిత్యం సైక్లింగ్ చేయడంతో ఆరోగ్యంగా ఉన్నానన్నారు. సైక్లింగ్‌తో కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి హెల్మెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయికి ఎంపికైన జిల్లా సైక్లిస్టులు

సిద్దిపేట కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ జిల్లా మల్కాజిగిరిలో ఈ నెల 5 నుంచి 7 వరకు జరిగే రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. అండర్ 14, అండర్ 17 బాలికల విభాగంలో రిజ్వానా, అంకిత, లిఖిత, వర్షిత, శీలం శ్రీనిధి, మద్దెల సంజన, జంగపల్లి రేణుక, సాయిప్రసన్న, బాలుర విభాగంలో నీలం జశ్వంత్, బళ్ల నిఖిల్, బి. ప్రసాద్, జి. చరణ్, అవన్‌రెడ్డి ఎంపికైనట్లు రాష్ట్ర స్థాయి క్రీడా సమాఖ్య అధికారులు తెలిపారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన జిల్లా సైక్లిస్టులు

## న్యూస్ బాక్స్

### స్వామి వివేకానంద విగ్రహావిష్కరణకు ఆహ్వానం

గుమ్మడిదల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మండల కేంద్రంలో సీజీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న స్వామి వివేకానంద విగ్రహావిష్కరణకు, ఓపెన్ టూ ఆల్ క్రీడా పోటీలకు హాజరుకావాలని సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ చెన్నూరు రూపేష్‌ను ఆహ్వానించారు.

### అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు

రాయికోడ్/కొడిపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకు, ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే వారికి మాత్రమే గృహాలు మంజూరు చేస్తామని మండల ప్రత్యేక అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ అధికారి జగదీశ్వర్ అన్నారు. శనివారం రాయికోడ్ మండల పరిధిలోని సింగితం, రాయికోడ్ గ్రామాల్లో ఇందిరమ్మ గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను, గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొడిపల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను డీఎల్పీవో సాయిబాబా ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు.

### మంత్రి ఆదేశాలతో 108 వాహనం

రేగోడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో రేగోడుకు 108 వాహనం వచ్చిందని రాయికోడ్ టీపీసీసీ మెంబర్ మున్నూరు కిషన్, కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. శనివారం రేగోడుకు కేటాయించిన 108 వాహనాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వట్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీధర్ గుప్తా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### 25 సెల్‌ఫోన్లు అందజేత

నర్సాపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సర్కిల్ పరిధిలో ఈ మధ్యకాలంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ప్రత్యేక పోర్టల్ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్న పోలీసులు.. శనివారం తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డి చేతుల మీదుగా సంబంధిత వ్యక్తులకు అందజేశారు. అలాగే పాపన్నపేట మండలానికి చెందిన నాలుగు ఫోన్లను ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు.

### మల్లికార్జునస్వామి ఉత్సవాలు ప్రారంభం

నర్సాపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం సుప్రభాతసేవ, గణపతపూజ, దేవతాహ్వానము, అభిషేకం, రుద్రయాగం, పూర్ణాహుతి నిర్వహించారు.

### 7న వాహనాలకు వేలం

నర్సాపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న నాలుగు ద్విచక్ర వాహనాలకు 7న వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ పద్మ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న రెండు పల్సర్, ఒకటి బజాజ్ డిస్కవరి, ఒకటి గ్లామర్ బైక్ ఉన్నదని తెలిపారు. ఆసక్తిగల వారు ధరలో 25 శాతం చెల్లించి పాటలో పాల్గొనాలని సూచించారు.

### సీఎంను కలిసిన ఎమ్మెల్యే

నారాయణఖేడ్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఖేడ్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను మంత్రుల క్వార్టర్స్‌లో కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఖేడ్ ఆర్టీసీ డిపోకు అదనపు బస్సులు అవసరమని, ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు సహకరించాలని కోరారు.

### 'సమస్యలు పరిష్కరించాలి'

సంగారెడ్డి రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్‌కు శనివారం ఏఈవోలు వినతిపత్రం అందజేశారు.

## క్రైం కార్నర్

### ఇరువురిపై పోక్సో కేసు

మాసాయిపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలానికి చెందిన ఇరువురిపై పోక్సో కేసు నమోదైనట్లు చేగుంట పోలీసులు తెలిపారు. మాసాయిపేట మండలానికి చెందిన ఓ బాలికపై ఇరువురు వ్యక్తులు అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇరువురిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- 125 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

పటాన్‌చెరు/మునిపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హామీఇచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కలాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద 125 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను శనివారం పటాన్‌చెరు తన క్యాంపు కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. ఒకేసారి 125 మంది లబ్ధిదారులకు రూ.1.25 కోట్ల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, తహసీల్దార్లు రంగారావు, రాధ, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మునిపల్లి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూరి సుధాకర్‌రెడ్డి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ ఆశాజ్యోతి, కాంగ్రెస్ నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు పాండు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

# అంధులకు అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ అని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి సందర్భంగా శనివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. లూయిస్ బ్రెయిలీ తనకు అంధత్వం వచ్చిందని బాధపడకుండా అంధులు చదువుకునేందుకు వీలుగా ప్రత్యేక లిపిని రూపొందించారన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణిలో 14 అర్జీలు అందాయి. 8న కలెక్టరేట్ కార్యాలయంలోని ఆడిటోరియంలో ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ దివ్యాంగులు తమ తమ విద్యార్హతల ధ్రువపత్రాలతో హాజరుకావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో పద్మజా రాణి, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి, జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్, జిల్లా అంధుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న క్రాంతి

# అట్టహాసంగా జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్

- జిల్లా నలుమూలల నుంచి 200 మంది హాజరు

సంగారెడ్డి అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని అంబేడ్కర్ భవన్‌లో జిల్లా విద్యాశాఖ, తెలంగాణ సోషల్ ఉపాధ్యాయుల ఫోరం సంయుక్తంగా పదవ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ శనివారం నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచి 200 మంది విద్యార్థులు ప్రతిభ పరీక్షకు హాజరయ్యారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, గురుకులాల విద్యార్థులకు సంబంధించి ప్రశ్నాపత్రాన్ని వేర్వేరుగా జిల్లా నోడల్ అధికారి లింబాజీ విడుదల చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన 9 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్షకు ఎంపిక చేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు డీఈవో వెంకటేశ్వర్లు, వాసవీ మాఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు తోపాజి అనంతకిషన్ ప్రశంసాపత్రాలు మెమెంటోలు అందజేయగా, సోషల్ టీచర్స్ ఫోరం తరఫున నగదు బహుమతిని అందజేశారు. సోషల్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షురాలు డా.సునీతఖన్నా, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, సంగారెడ్డి ఎంఈవో విద్యాసాగర్, సోషల్ టీచర్లు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని అంబేడ్కర్ భవన్‌లో సోషల్ టాలెంట్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

# సమిష్టి కృషితోనే సమస్యలు పరిష్కారం

రామచంద్రాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, ప్రజల సమిష్టి కృషితోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని విభాగాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం డబుల్ బెడ్‌రూం వాసులతో ప్రత్యేకంగా సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. డబుల్ బెడ్ రూంల కమిటీ సభ్యులు పూర్తిస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జీహెచ్ఎంసీ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం మున్సిపల్ నిధులతో చేపడుతున్న ఫంక్షన్‌హాల్, బీటీరోడ్డు, స్త్రీ శక్తి మహిళా క్యాంటీన్ పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో కమిషనర్ సంగారెడ్డి, డీఈఈ సత్యనారాయణ, తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న కమిషనర్ సంగారెడ్డి

# దర్పల్లిలో అభివృద్ధి ప్రణాళికపై గ్రామసభ

చిన్నశంకరంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలం ధర్పల్లి గ్రామంలో అభివృద్ధి ప్రణాళికపై శనివారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో గ్రామస్థులతో కలిసి ప్రణాళికను రూపొందించారు. అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ హయాంలోనే మేలు

- మెదక్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ హయాంలోనే రైతులకు మేలు జరిగిందని మెదక్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చేగుంట మండలం బి కొండాపూర్ గ్రామ పెద్దచెరువులో గంగమ్మకు పూజలు నిర్వహించి పంటల సాగుకోసం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ రైతులు పంటలు పండించేందుకు ప్రాజెక్టుకు నిర్మాణం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ మమత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

### ఉద్యోగులను రోడ్డెక్కించిన రేవంత్

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి



నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సీఎం అయ్యాక రేవంత్‌రెడ్డి వారి సమస్యలు పరిష్కరించకుండా సమగ్ర శిక్షా ఉద్యోగులను రోడ్డెక్కించారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆరోపించారు. శనివారం సమ్మెకు సంఘీభావం తెలిపి వారితో కలిసి శిబిరంలో బైఠాయించారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మె శనివారం 29వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా సంగారెడ్డిలో మహార్యాలీ నిర్వహించారు. ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు మహార్యాలీ నిర్వహించి కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించి నినదించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు మరెల్లి దత్తు, ప్రధాన కార్యదర్శి అనిల్‌చారి, ఉద్యోగులు పాల్గొన్నారు.

### 'మెరుగైన సమాజం కోసం యువత కీలకం'

నర్సాపూర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : మెరుగైన సమాజం కోసం యువత కీలకమని రిటైర్డు ఎస్పీ మల్లారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కృషివిజ్ఞాన్ గ్రామీణాభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో 'మెరుగైన సమాజ నిర్మాణంలో యువత పాత్ర' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య వక్తలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వారి చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. సుహాసినిరెడ్డి మాట్లాడుతూ యువత చైతన్యంతో కూడిన ఆలోచన, పరిశోధనాత్మకంగా సరైన దారిలో నడిచినప్పుడే మెరుగైన సమాజం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ప్రతిభచూపిన వారికి బహుమతులు అందజేశారు. అలాగే నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన లైబ్రరీని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి సందర్శించారు.

### కూలీ డబ్బుల కోసమే మహిళ హత్య

- వ్యక్తిపై కేసు, రిమాండ్‌కు తరలింపు

మనోహరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కూలీ డబ్బుల విషయంలో గొడవపడి మహిళను హత్యచేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. బీహార్ రాష్ట్రం ముజఫర్‌పూర్ చెందిన సూరజ్‌కుమార్ 2015లో నీతూదేవిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నది. సూరజ్ అక్కడే రిక్షాను అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. 2022లో అతడికి ముజఫర్‌పూర్‌లో రజినీదేవితో పరిచయం ఏర్పడింది. వీరు 2023 అక్టోబరులో హైదరాబాద్‌కు వచ్చారు. భార్యాభర్తలమని చెప్పి మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లోని గీతా ప్యానెల్ పరిశ్రమలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కూలీ డబ్బులు తనకు ఇవ్వాలని సూరజ్ అనడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. నవంబరు 18న మద్యం సేవించి వచ్చిన సూరజ్ రజినీదేవిని డబ్బులు ఇవ్వమని అడిగి గొడవపడ్డాడు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడై చున్నీతో రజినీదేవిని హత్యచేసి, ఆమె వద్ద ఉన్న రూ.7 వేలను తీసుకుని ఇంటికి తాళం వేసి పారిపోయాడు. ఇతరుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని పట్టుకున్నారు. ఈ మేరకు సూరజ్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

### రంగంపేట వైన్స్‌లో చోరీ

కొల్చారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రంగంపేట వెంకటదుర్గా వైన్స్‌లో దొంగతనం జరిగింది. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. రోజులాగా వైన్స్ షాపు యజమానికి శుక్రవారం తాళం వేసి వెళ్లాడు. రాత్రి షట్టర్ పగులగొట్టిన దుండగులు లోపలికి వెళ్లి రూ.70 వేల నగదును ఎత్తుకెళ్లారు. అయితే దుండగుల దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ గౌస్ వివరాలు సేకరించారు. వరుస దొంగతనాలతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

# రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

- లారీ ఢీకొని ఒకరు.. ఆటో ఢీకొని ఆరుగురు, కారు అదుపుతప్పి మరో ఇద్దరికి...



శివ్వంపేట: పొలంలో బురదలోకి దూసుకెళ్లిన కారు





చిన్నశంకరంపేట: ప్రమాదంలో గాయపడ్డ మహిళలు, నుజ్జునుజ్జయిన ఆటో

తూప్రాన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైన సంఘటన తూప్రాన్, చిన్నశంకరంపేట, శివ్వంపేట మండలాల్లో చోటు చేసుకున్నాయి. హైవే పనులకు నీటిని తీసుకెళ్తున్న వాటర్ ట్యాంకర్‌ను లారీ ఢీకొట్టింది. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద హైవే రోడ్డు నిర్వహణకు మాసాయిపేట శివారు నుంచి ట్యాంకర్‌లో నీటిని తీసుకెళ్తున్నారు. మార్గమధ్యలో హైవే 44పై హల్దీవాగు వద్ద ఇస్లాంపూర్ శివారులో వెనక నుంచి వచ్చిన లారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్, బొమ్మారం గ్రామానికి చెందిన నెంటూరు సిద్ధిరాములు, ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన కూలీ చెర్లపల్లి మంజుల గాయపడ్డారు. ఇరువురిని తూప్రాన్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందజేశారు.

**ఆటో ఢీకొని..**

చిన్నశంకరంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆటోను బొలెరో వాహనం ఢీకొట్టిన ఘటనలో పలువురు గాయపడ్డారు. మెదక్ మండలం ఖాజిపల్లి గ్రామానికి చెందిన కూలీలు శాలిపేటలో పనులు ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. కాగా మెదక్-చేగుంట రహదారిపై కొర్విపల్లి గ్రామ శివారుకు రాగానే మద్యం తరలిస్తున్న బొలెరో వాహనం ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

**కారు అదుపు తప్పి...**

శివ్వంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కారు టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి పంట పొలంలోకి దూసుకెళ్లిన ఘటనలో దంపతులకు స్వల్పగాయాలయ్యాయి. వెల్దుర్తికి చెందిన డాక్టర్లు శ్రీకాంత్, భార్య లక్ష్మి దంపతులు కారులో వెల్దుర్తి నుంచి శివ్వంపేట మండలం ఉసిరికపల్లి మీదుగా నర్సాపూర్‌కు బయలుదేరారు. ఉసిరికపల్లి శివారులో కారు అదుపుతప్పి పంట పొలంలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో కారు బెలూన్స్ ఓపెన్ కావడంతో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వారిని తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు.

### బాధిత కుటుంబాలకు ఎల్‌వోసీలు అందజేత

నర్సాపూర్/కొల్చారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం లింగాపూర్‌కు చెందిన ఉప్పలమల్లేశ్ నిమ్స్‌లో చికిత్స పొందుతుండగా ఆయనకు మంజూరైన రూ.2 లక్షల ఎల్‌వోసీని, కౌడిపల్లి మండలం దేవులపల్లికి చెందిన బి.రామయ్య కూడా నిమ్స్‌లో చికిత్స పొందుతుండగా రూ.లక్ష ఎల్‌వోసీని, శివ్వంపేట మండలం చెన్నాపూర్‌కు చెందిన రిషి రూ.లక్ష ఎల్‌వోసీని నర్సాపూర్‌లోని తన స్వగృహంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి రూ.4.61 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అందజేశారు. కొల్చారం మండలంలోని రంగంపేట సంగమేశ్వర ఆలయంలో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే సునీతారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేష్‌కుమార్, మాజీ జడ్పీటీసీ ఎనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగులగారి మల్లేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక వసతులకు నిధులు ఇవ్వండి

- జీహెచ్ఎంసీ జడ్సీకి కార్పొరేట్ విజ్ఞప్తి

పటాన్‌చెరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు డివిజన్‌లో మౌలిక వసతులు, పార్కులు, ఓపెన్‌జిమ్‌ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ అనిల్‌కుమార్‌కు శనివారం కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని ఎంజీ రోడ్డులో ట్రయాంగిల్ సర్కిల్‌లో పార్కు అభివృద్ధికి 3.50 లక్షలు, కృషి డిఫెన్స్ కాలనీలోని పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు రూ.19.50 లక్షలు, పటాన్‌చెరు మైత్రీ గ్రౌండ్‌లో ఓపెన్ జీమ్ ఏర్పాటుకు మరో రూ.19.50 లక్షలు మంజూరు చేయాలని కోరారు. కాగా పట్టణంలో డ్రైనేజీలు, పైపులైన్ల ఆధునీకరణ, సీసీరోడ్లకు గతంలో ఇచ్చిన రూ.50 లక్షల పెండిగ్ పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు. రూ.6 కోట్లతో పట్టణంలోని నిర్మించిన గాంధీ పార్కు, ఆసుపత్రి పక్కన నిర్మించిన ఫ్రీడం పార్కులను ప్రజల సందర్శనకు వీలుగా సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రారంభించాలని కోరారు.

### 'వన నర్సరీలపై దృష్టి సారించాలి'

వట్‌పల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : వన నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు పీడీ బాలరాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం వట్‌పల్లి మండలం దుద్యాల గ్రామంలోని వన నర్సరీని పరిశీలించి మాట్లాడారు. వన నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని నర్సరీల నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఏపీడీపూజిత, ఏపీవో, టీఏలు ఉన్నారు.

### 'స్టోన్ క్రషర్ ఏర్పాటును విరమించుకోవాలి'

జిన్నారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో నూతన స్టోన్ క్రషర్ ఏర్పాటు ప్రతిపాదన విరమించుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. శనివారం మాజీ సర్పంచ్ జనార్థన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్, నాయకులు సమావేశం నిర్వహించారు. ఇటీవల నల్తూరు గ్రామ శివారులోని 160 సర్వే నెంబరులో స్టోన్ క్రషర్ ఏర్పాటు కోసం అనుమతులు ఇవ్వగా.. అక్కడ నిర్వహిస్తున్న పనులు అడ్డుకుని కలెక్టర్, ఏడీ మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మైనింగ్, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారని, గ్రామానికి సమీపంలో క్రషర్ ఏర్పాటుతో స్థానికులు తీవ్రంగా నష్టపోతారని అధికారులు నివేదికను ఇచ్చారు. వాస్తవ పరిస్థితులను నివేదికలో పేర్కొన్న రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులకు వారు ధన్యవాదాలు తెలిపి, క్రషర్ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని కోరారు.

### ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయడం లేదని ఆందోళన



నార్సింగి గ్రామపంచాయతీ వద్ద ఆందోళన చేస్తున్న వడ్డెర వాసులు

చేగుంట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అటు నార్సింగి మండలం, ఇటు చేగుంట మండలం ఎటూ తేల్చుకోలేని వల్లాబహూర్‌కు చెందిన వడ్డెర కాలనీ వాసులు ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయడం లేదని వడ్డెర కాలనీవాసులు శనివారం నార్సింగి గ్రామపంచాయతీ వద్ద ఆందోళనకు దిగారు. బండరాళ్లు కొట్టుకొని జీవనం సాగిస్తున్న తాము నార్సింగి 14 వార్డులో ఉన్నా ఆధార్‌కార్డులు చేగుంట మండలం వల్లబహూర్‌లో ఉండడంతో సంక్షేమ పథకాలు అందడం లేదని, అధికారులూ పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి ఆధార్‌కార్డులను సరిచేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### వృద్ధాప్య పింఛన్లను ఎగ్గొట్టిన బీపీఎం

కోహీర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పీచేర్యాగడి గ్రామ బ్రాంచ్ పోస్టుమాస్టర్ (బీపీఎం) నిఖిల్ పలువురి వృద్ధాప్య లబ్ధిదారుల చేయూత పింఛన్లను మూడునెలల నుంచి ఇవ్వకుండా ఎగ్గొట్టేశాడు. దాదాపు రూ.లక్ష వరకు కాజేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఈ విషయం డివిజన్ పోస్టల్ అధికారులకు తెలియడంతో శనివారం జహీరాబాద్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రఘువీర్, పలువురు పోస్టల్ సిబ్బంది గ్రామానికి వచ్చి విచారణ జరిపారు. లబ్ధిదారుల పింఛన్ డబ్బులను బీపీఎం కాజేసిన విషయం వాస్తవమేనని తేల్చారు. ఈ విషయాన్ని బీపీఎం నిఖిల్ తల్లిదండ్రులకు తెలియజేశామన్నారు. పై అధికారుల ఆదేశాల మేరకు నిఖిల్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### మూడు రాష్ట్రాల పరిధిలో 350 బ్రాంచ్‌లు

- సెంట్రల్ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ హెడ్ ధారాసింగ్

రామాయంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో సెంట్రల్ బ్యాంకులు లాభాల బాటలో పయనిస్తున్నాయని హైదరాబాద్ జోనల్ హెడ్ ధారాసింగ్‌నాయక్ పేర్కొన్నారు. ఇప్పటికే తన పరిధిలో 350 సెంట్రల్ బ్యాంకు శాఖలు పనిచేస్తుండగా.. 6 లక్షల 44 వేల కోట్ల వ్యాపారం నడుస్తుందన్నారు. శనివారం రామాయంపేట బ్రాంచ్ నూతన భవనాన్ని రీజనల్ హెడ్ కృష్ణమోహన్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు ప్రత్యేకంగా 109 బ్యాంకులు పనిచేస్తున్నాయన్నారు. కొత్త జిల్లాలైన ఆసిఫాబాద్, నిర్మల్, భూపాలపల్లి, ములుగులో త్వరలోనే తమ శాఖలు విస్తరించనున్నాయన్నారు. ఇందులో రామాయంపేట బ్రాంచ్ మేనేజర్ భీముడు, సిబ్బంది, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్‌రావు, కౌన్సిలర్లు దేమె యాదగిరి, నాగరాజులు ఉన్నారు.

### 'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

మనోహరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అన్నారు. శనివారం మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నారా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో రికార్డులను పరిశీలించి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈసారి పాస్ శాతం తక్కువ వస్తే ఉపాధ్యాయులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.